18వ వసంతంలోకి
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం,3 డిసెంబర్ 2024


# సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

**– డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించిన అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి అదనపు కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు ఎనిమిది మంది డయల్ యువర్ కమిషనర్ నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను ఆధికారులకు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అదనపు కమిషనర్ సుధాకర్ నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని.. పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ ఇలా పలు సమస్యలపై సుమారు 36 వరకు అర్జీలు అందాయి. వాటిపై అదనపు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్లైన్లో పొందుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, ఎస్ఈ కామేశ్వరరావు, మేనేజర్ శిరీష్, అకౌంటెంట్ సత్యనారాయణ, ఏడీహెచ్ సిరిల్, టీపీఆర్వో శైలజ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ పోర్టు వ్యవహారంపై

# మంత్రివర్గ ఉపసంఘం సీరియస్

**– విచారణకు ఆదేశాలు**



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** పేదలకు అందాల్సిన పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, కాకినాడ పోర్టు వ్యవహారం ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక, పేదలకు అందాల్సిన పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. కాకినాడలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి భారీస్థాయిలో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలను వెలుగులోకి తీసుకువచ్చారు. తాజాగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విదేశీ నౌక స్టెల్లా ఎల్1 లో ఎగుమతికి సిద్ధంగా వున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాను గుర్తించి, ఆ షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏపీలో పోర్టుల ద్వారా రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించడంతోపాటు పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. కాకినాడ పోర్టు అధికారులు, మారిటోరియం బోర్డు సీఈవోపై మంత్రివర్గ ఉపసంఘం సీరియస్ అయ్యింది. రేషన్ బియ్యం అరికట్టడానికి బదులుగా ప్రోత్సహించారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. వేర్‌హౌస్‌లలో మిషనరీ ఉండకూడదనే విషయం తెలిసినా, ఐదు సార్టెక్స్ మిషన్‌లు వేర్‌హౌస్‌లో వున్నా ఎందుకు పట్టించుకోలేదంటూనిలదీసింది.రేషన్ బియ్యాన్నిసార్టెక్స్ బియ్యంగా మారుస్తున్నా గుర్తించలేదా? తెలిసీ ఊరుకున్నారా? అంటూ అధికారులను నిలదీసింది. అక్కడకు మిషన్‌లు ఎలా వచ్చాయనే మంత్రుల ప్రశ్నకు అధికారులు మౌనం దాల్చినట్లు తెలుస్తోంది.

ఈ వ్యవహారంపై మంత్రివర్గ ఉపసంఘం విచారణకు ఆదేశించింది. వేర్‌హౌస్‌లు ఎవరిపేరుతో వుంటే వారిపై ముందుగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

# కాకినాడ పోర్టు వద్ద చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను ఏర్పాటు చేస్తాం

**- మూడు షిఫ్టుల్లో భద్రత పెంచుతాం**

**- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**





**ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** కాకినాడ పోర్టు వద్ద చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, మూడు షిఫ్టుల్లో భద్రతను పెంచుతామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం సచివాలయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్...ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఐపిసి ఇన్వాల్వ్ చేసేలా రవాణా వ్యవస్థ కఠినతరం చేస్తామని వెల్లడించారు. ట్రాన్స్‌పోర్ట్ మెకానిజంలో మార్పులు చేపడతామన్నారు. కాకినాడ పోర్టులో బియ్యం అక్రమ రవాణా కేసులో 28 కంపెనీల ప్రమేయం వుందని, వీరంతా ఒక ముఠాగా ఏర్పడి దక్షిణాఫ్రికాకు అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. స్టెల్లా షిప్‌ను సీజ్ చేసే అధికారం ప్రభుత్వానికి వుందని, నౌక జప్తునకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ వేర్‌హౌస్‌లో నిబంధనలకు విరుద్ధంగా సార్టెక్ మిషన్లు ఉన్నాయని, గోదాముల్లోనే రీసైక్లింగ్ జరుగుతోందన్న అనుమానం ఉందన్నారు. ఈ విషయమై మంత్రివర్గ ఉపసంఘం అధికారులను నిలదీయడం జరిగిందని, అధికారుల నుంచి సంతృప్తి కరమైన సమాధానం రాలేదన్నారు. గోదాములను లీజుకు తీసుకున్న దెవరో తేల్చాలని అధికారులను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు.

## పోలి పాడ్యమి- భక్తులతో కిక్కిరిసిన శైవ క్షేత్రాలు



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** సోమవారం పోలి పాడ్యమి- పోలి స్వర్గం కావడంతో మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరి సాయి. తెల్లవారుజాము నుండి భక్తులు హర హర మహాదేవ శంభో శంకర అనే పంచాక్షర నామంజపిస్తూ ఆమహా శివునికి పంచామృతలతో అభిషేకాలు నిర్వహించారు. నందీశ్వరుని దర్శించుకొని ధ్వజస్తంభం వద్ద360 ఒత్తులను వెలిగించారు. స్థానిక పురోహితులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామి, కొండపై ఉన్న శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ వాయు లింగేశ్వరుడు, జడ్డంగి శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

## ప్రతి మండల తాహిసిల్దార్ కార్యాలయంలో "పిజిఆర్ఎస్ - మీ కోసం" కార్యక్రమం

**-ఆర్డీవో రాణి సుస్మిత**




**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ప్రతిమండల తాహిసిల్దార్ కార్యాలయంలో జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. మీ కోసంలో వచ్చిన ప్రతి అర్జీలను పరిశీలించి అర్జీదారునికి పూర్తి స్థాయి న్యాయం చెయ్యాలని ఆర్డీఓ డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన "పిజిఆర్ఎస్ – మీ కోసం" వేదికలో వచ్చిన అర్జీలను డివిజన్ స్థాయి అధికారులతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లా డుతూ "పిజిఆర్ఎస్ – మీకోసం" ద్వారా ప్రజల నుంచి 3 అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదారునికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చినరాజప్పకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు సోమవారం పెద్దాపురం పట్టణంలో మున్సిపల్ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాల పెంపు, 15ఏళ్ళు పైబడినవారిని రెగ్యులర్ చేయాలని, వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అలాగే డిశంబర్ 9నుంచి రాష్ట్రసంఘం పిలుపు మేరకు సమ్మెలోకి వెళుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సుంకర నాగేశ్వరరావు, వాకాడ భాస్కరరావు, సత్తిరాజు, సోనియా, రమణ, భద్రరావు, ప్రశాంత్, బషీర్, శివకోటి సాయి, స్వామి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 అర్జీలు




**పెద్దాపురం,మేజర్‌న్యూస్:**సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చినట్లుఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ ఈరంకి ప్రభాకరశర్మ, డిఎల్‌పిఓ కార్యాలయ ఏఓమైథిలి, మున్సిపల్ సిబ్బంది దవులూరి రాజారావు, తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, డిటి భాను కుమార్, దయానందరాజు, నారాయణ,అర్జీదారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం పవన్ పర్యటనతో...

# అక్రమ రవాణా గుట్టు రట్టు



- గత ఐదేళ్ళూ పోర్టుకు ఎవరినీ రానీయకుండా గత ప్రభుత్వం కుట్ర
- మీడియాకు సైతం పోర్టు కార్యకలాపాలు తెలియనివ్వకుండా చేశారు
- రాష్ట్రంలో 29 వేల రేషన్ షాపులు వున్నా.. డోర్ డెలివరీ పేరుతో రాష్ట్ర ఖజానాకు రూ.1600 కోట్ల ఖర్చు
- కాకినాడ పోర్టు నుండి 1.30 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమంగా ఎగుమతి
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనతో కాకినాడ పోర్టులో జరుగుతున్న పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం బయటపడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళుగా అక్రమంగా బియ్యం రవాణా జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలపై దాడులు చేయడం జరిగిందన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదు నెలల్లోనే 6ఎ కేసులు 1066 నమోదు చేశామన్నారు.సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాకినాడ పోర్టుపైన తాము దృష్టి సారించడానికి గల కారణాలు అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లోపల ఏయే కార్యక్రమాలు జరుగుతున్నాయి, ఎటువంటి బోట్లు వస్తున్నాయి, అధికారులు ఎవరున్నారు. ఏ విధమైన కార్యక్రమాలు జరుగుతున్నాయన్న విషయాలు బయటకు తెలియకుండా గత ప్రభుత్వం కాకినాడ పోర్టు వైపు ఎవరూ రాకుండా కుట్ర చేసిందన్నారు. ప్రభుత్వ ఆస్తి, రాష్ట్ర వనరుల్లో భాగం అయిన కాకినాడ పోర్టుకు కనీసం మీడియాను సైతం అనుమతి ఇవ్వలేదన్నారు. రూ.45 వేల కోట్లు విలువ చేసే ఒక కోటి 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి అక్రమగా ఎగుమతి చేశారని, జగన్‌కి తెలియకుండా ఇది జరిగే అవకాశం లేదన్నారు.

రాష్ట్రంలో బియ్యం సరఫరా చేయడానికి 29 వేల రేషన్ షాపులు ఉన్నాయని, అయినా గత ప్రభుత్వం డోర్ డెలివరీ అనే అబద్ధపు ప్రచారంతో బియ్యం అక్రమ రవాణాకు తెరతీసిందన్నారు. రూ.1600 కోట్ల ఖర్చు చేసి 9260 వ్యాన్లు కొని ఒక నెట్‌వర్క్ తయారుచేశారన్నారు. అంతకుముందు ఉన్న రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా 1వ తారీఖు నుండి 15వ తారీఖు వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వినియోగదారులు ఎప్పుడు వచ్చినా సరుకు అందించే ఒక మంచి ప్రక్రియ ఉండేదని, కాని గత ప్రభుత్వం తమ స్వలాభం కోసం డోర్ డెలివరీ అనే పేరుతో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని బియ్యం సేకరించడం మొదలు పెట్టారని, చాలా చోట్ల సరైన సమయానికి రాలేదు కాబట్టి వ్యాను వెళ్ళిపోయిందని అందుకే సరుకు ఇవ్వము అని చెప్పేవారని, ప్రభుత్వానికి ప్రతి కిలోకి 43.40 రూపాయలు ఖర్చయ్యే ఈ బియ్యాన్ని క్షేత్రస్థాయిలో 10 రూపాయలకే తీసుకున్నారన్నారు. మెడ మీద కత్తి పెట్టి కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ నుండి లాగేసుకుని వీళ్లు అరబిందోకి అప్పజెప్పారని, ఆరోజు నుండి లెక్కలు చూస్తే ఎంతటి అవినీతి జరిగిందో తెలుస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏ పోర్టులో లేని విధంగా కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతి జరిగిందన్నారు. ఒక గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసుకుని చిత్తూరు, శ్రీకాకుళం నుంచి నేషనల్ హైవే మీద నేరుగా కాకినాడకు బియ్యం తరలించే విధంగా పకడ్బందీగా ప్లాన్ చేసుకున్నారన్నారు.

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో.. గంగవరం పోర్టు నుండి – 2,20,289 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టు నుండి – 23,51,218 మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం పోర్టు నుండి – 38,02,000 మెట్రిక్ టన్నుల ఎగుమతి జరిగిందని, కాకినాడ పోర్టు నుంచి ఏకంగా 1,31,18,346 మెట్రిక్ టన్నులు ఎగుమతి జరిగిందన్నారు. ఒక్క కాకినాడలో జరిగిన దీని విలువ 48,537 కోట్ల రూపాయలు ఉంటుందన్నారు. గత ముఖ్యమంత్రి జగన్‌కు తెలియకుండా ఇంత భారీ స్థాయిలో దోపిడీ జరిగే అవకాశం లేదన్నారు. అరబిందో రియాల్టీకి కాకినాడ సీపోర్ట్స్ ఎందుకు 41% వాటా ట్రాన్స్‌ఫర్ చేసింది? ఏ సందర్భంలో చేసింది? అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశ కార్పొరేట్ చరిత్రలో ఏనాడు జరగని విధంగా కే.వీ.రావు, వారి కుటుంబాన్ని బెదిరించి ఏ విధంగా 41 శాతం వాటా రాయించుకున్నారనే విషయం కచ్చితంగా బయటకు రావాల్సివుందన్నారు.

## కన్నుల పండుగగా కార్తీకమాసం చివరి రోజు వేడుకలు




**మల్లేపల్లి,మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో మల్లేపల్లి ఉప్పలపాడు గ్రామాల్లో ఉన్న శివాలయాలు అభిషేకాలతో భక్తులతో కిటకిటలాడాయి. అందులో భాగంగా మండలంలో మల్లేపల్లి గ్రామంలో కొత్తూరు రామాలయం వద్ద రామకుర్తి సత్తిబాబు గురువు ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే తల స్నానాలు ఆచరించి స్వామివారిని పల్లకిలో బాణాసంచాల మధ్య శివ నామాలు.భజన్త్రీలతో భక్తి గీతాలు ఆలపిస్తూ స్వామివారిని ఊరేగింపుగా గ్రామమంతట తీసుకువెళ్లారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో మహిళలు అఖండ జ్యోతులను శిరస్సు మీద పెట్టుకుని గ్రామమంతా తిరిగి, భక్తులు స్వామివారి పల్లకి ముందు శివనామ స్మరణలతో ఊరేగింపుగా వెళ్లారు. ఈ దృశ్యాలు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఊరేగింపులో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. గత 20 సంవత్సరాలుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

## జాతీయ స్థాయి సపక్ తక్ర పోటీలకు ఇసుకపూడి విద్యార్థి ఎంపిక



**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** జాతీయ స్థాయి సపక్ తక్ర పోటీలకు ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కన్నేటి పూర్ణ లక్ష్మీప్రసన్న ఎంపికైనట్లు హెచ్ఎం ఎ.ఎల్.వరప్రసాద్, పీడీ బూల చిరంజీవి తెలిపారు. స్థానిక హైస్కూల్లో పూర్ణలక్ష్మి ప్రసన్నను సోమవారం పలువురు సత్కరించారు. 27వ రాష్ట్ర స్థాయి సపక్ తక్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 26, 27 తేదీల్లో నంద్యాల జిల్లా నందుకొట్టూరులో జరిగిన సబ్ జూనియర్ సపక్ తక్ర పోటీలలో పూర్ణ లక్ష్మీ ప్రసన్న అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.ఈ నెలలో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనుందన్నారు.జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పూర్ణలక్ష్మీ ప్రసన్నను సర్పంచ్ తరపట్ల మోహన్ సింగ్ బాబురావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, మాజీ సర్పంచ్ పెదిరెడ్డి వెంకటేశ్వరరావులు అభినందించి నగదు ప్రోత్సాహాన్ని అందించారు. అలాగే ఎస్ఎంసీ విద్యా కమిటీ చైర్మన్ పళ్ల స్వామినాయుడు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## పిజిఆర్ఎస్ - మీ కోసంలో ప్రజల నుంచి 20 అర్జీల స్వీకరణ



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన"పిజిఆర్ఎస్ – మీ కోసం"లో ప్రజల నుంచి 20 అర్జీలను మునిసిపల్ కమిషనర్ తరపున ఇన్చార్జి అదనపు కమిషనర్ ఎస్. వెంకటరమణ స్వీకరించడం జరిగిందని తెలియ చేశారు.సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ తరపున ఇన్చార్జి అదనపు కమిషనర్ ఎస్. వెంకటరమణ అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న, సిటీ ప్లానర్ జి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## యాంత్రీకరణ వలన వ్యవసాయ సాగులో
## తక్కువ పెట్టుబడి, సమయం ఆదాతో పాటు రైతులు అధిక లాభాలను పొందవచ్చు

**–వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.డి.శ్రీనివాస్**



**రాజమహేంద్రవరంరూరల్,మేజర్‌న్యూస్ :** వ్యవసాయసాగులో యాంత్రీకరణ పద్ధతులను అవలంబించడం ద్వారా సమయం ఆదా, తక్కువ పెట్టుబడి ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందవచ్చు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. డి. శ్రీనివాస్ రైతులకు తెలియచేశారు. వ్యవసాయ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు అసోసియేట్ డీన్ డా. డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం రాజవోలు గ్రామం లో నిర్వహిస్తున్న జాతీయసేవా పథకం కాంప్ నాల్గవరోజు వ్యవసాయంలో యాంత్రికరణ మరియు ఎలుకల నివారణ యాజమాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయయంత్రాలవినియోగం ద్వారాఈరోజు మనం చూస్తున్నట్లుగా పెద్ద ఎత్తున వ్యవసాయం చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. జిపిఎస్ –గైడెడ్ ట్రాక్టర్ల నుండి ఆటోమేటిక్ నీటిపారుదల వ్యవస్థల వరకు, వ్యవసాయ యంత్రాలలో పురోగతి రైతులు అన్ని స్థాయిలలో మరింత సమర్థవంతంగా, ఉత్పాదకంగా పని చేయడంలో సహాయపడుతున్నా యన్నారు.అగ్రికల్చర్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డా.డి.సాయి గంగాధరరావు మాట్లాడుతూ యాంత్రీకరణ వలన వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని అన్నారు. మూడు నుండి నాలుగు సంవత్సరాల కొకసారి నేలను సబ్ సాయిలర్‌తో దున్నుట వలన నేలలో ఉన్న పోషకాలు ఉపరితలంలోకి చేరి మొక్కకు అందుతాయని మరియు మొక్కల యొక్క వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో ఉపయోగించే వివిధ యంత్రాలు ప్రదర్శిస్తూ వాటి యొక్క పని తీరు గురించి రైతులకు వివరించడం జరిగింది. అనంతరం ఎలుకల నివారణ కై విషపు ఎర్ర తయారు చేసే విధానాన్ని ఎంటమాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా బి.అనూష రైతుల సమక్షంలో ప్రదర్శన ద్వారా వివరించడం జరిగింది. ఎలుకల సమగ్ర నివారణ కై రైతులు సామూహిక విధానాలను అవలంభించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్చార్జి డా.సి హెచ్. సునీత, డా. హెచ్. శ్రీనివాస్‌వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, మరియు ఆర్బీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం కొవ్వూరుకు చెందిన ఈర్ల శ్రీనివాసరావు, ఓంలత దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్‌రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## తృటిలో తప్పిన ప్రమాదం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండలంలోని ర్యాలీ గ్రామంలో ప్రధాన కాలువ చెంతన రోడ్డు నుండి వెళ్తున్న కారు ఒకటి ప్రమాదవశాత్తు చెట్టుని ఢీకొంది. దీంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. అతనిని 108 వాహనంలో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నేరుగా కాలువలోకి దూసుకెళ్తే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. దీనిపై ఎటువంటి పోలీస్ కేసు నమోదు కాలేదు.

## నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఆర్&బి కల్వర్ట్ నిర్మాణం పనులు



**– అడ్డుకున్న గ్రామస్తులు**

**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** అంబాజీపేట, పి.గన్నవరం రహదారి నిర్మాణంలో భాగంగా రహదారి మర్మతు పనులకు శీకారం చుట్టారు. యువగణపతి ఆలయం వద్ద ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేస్తున్న పంటబోదె తూరల నిర్మాణ పనులను గుత్తేదారులు చేపట్టారు. పంటబోదె తూరల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా చేపట్టడంతో గ్రామస్తులు స్థానికులు సోమవారం అడ్డుకున్నారు.ప్రధాన రహదారిలో పంటబోదెల ద్వారా నీరు వెళ్ళేదని, రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా వాటిని తొలగించి నూతన తూరలను ఏర్పాటు చేసేందుకు ఆర్&బి అధికారులు పనులు చేపట్టారు. నిబంధనలకు లోబడి తూరలు ఏర్పాటు చేయాల్సి ఉండగా గుత్తేదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ స్థానిక నాయకులు ఉందుర్తి నాగబాబు, కొల్లూరి దివాకర్‌లతోపాటు గ్రామస్తులు అడ్డుకున్నారు. తూరలు వేసే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, నిబంధనలు పాటించకుండా బురదలలో తూరలను ఏర్పాటు చేయడంతో పనులు చేయవద్దని తక్షణమే నిలుపుదల చేయాలని తూరల ను పూడ్చేందుకు వేయవలసిన మెటల్ వేసి నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులను చేపట్టాలనిడిమాండ్ చేశారు. ఇక్కడ జరుగుతున్న సంఘటనను సంబంధిత ఉన్నతాధికారులకు సమస్యను సెల్ ఫోన్ ద్వారా తెలియపర్చడంతో తక్షణమే పనులను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని నిర్మాణదారులకు తెలియచేయడంతో తాత్కాలికంగా పనులు నిలిపోయాయి. పూర్వం నుండి రైతులకు పంటలు పండించుకొనేందుకు చెరువులలో నీరు నింపేందుకు మాచవరం గ్రామపరిధిలోని మూడుప్రాంతాల నుండి ఇసుకపూడి కెనాల్ ద్వారా మాచవరం, పోతాయిలంక రహదారి, యువగణపతి ఆలయంవద్ద, గ్రామ కచేరి చావిడి ప్రాంతాల సమీపంలోను కలిపి మూడు పంట బోదెలు ద్వారా పూర్వంనుండి నీరు వెళ్ళేదని పలువురు రైతులు, స్థానికులు తెలిపారు.

## పిఠాపురంలో ప్రారంభమైన ఎన్టీఆర్ మీల్

**–పేదవారి ఆకలి తీర్చడానికి జూనియర్ ఎన్టీఆర్ మీల్**
**–పిఠాపురం జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు**



**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** పేదవారి ఆకలి తీర్చడానికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు (రా ఎన్టీఆర్) మీల్ సురేష్ సారథ్యంలో... పిఠాపురం జూనియర్ ఎన్టీఆర్ పట్టణ ప్రెసిడెంట్ నల్ల గోవింద్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీడియా కన్వీనర్ ఎన్. ఏ కుమార్ ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలో ఉన్న పేదలకు, బిక్షాటన చేసే వారికి, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అనాథలకు భోజనాలు అందించారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ పిఠాపురం పట్టణ అధ్యక్షులు నల్ల గోవింద్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీడియా కన్వీనర్ కుమార్ లను సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రెసిడెంట్ నల్ల గోవిందు మాట్లాడుతూ... మహా పుణ్యక్షేత్రమైన దక్షిణ కాశీ పాదగయ క్షేత్రం నుండి జూనియర్ ఎన్టీఆర్ మీల్ అనే కార్యక్రమం పిఠాపురంలో ప్రారంభించడం చాలా ఆనందదాయకమని, అన్న జూనియర్ ఎన్టీఆర్ పిలుపుమేరకుపేదలకు అన్నదానం చేస్తున్నామని తెలియజేశారు. రా జూనియర్ ఎన్టీఆర్ మీల్ సురేష్ మాట్లాడుతూ... ఎవరైనా మమ్ములను సంప్రదించి భోజనం ఏర్పాట్లు చేయమంటే చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజకీయ ఉద్దేశం ఏమీ లేదని, అన్న జూనియర్ ఎన్టీఆర్ పిలుపుమేరకు ఇటువంటి మంచి కార్యక్రమం చేయాలని పిలుపునిచ్చిన మా అన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం పట్టణం జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు నల్ల గోవిందు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీడియా కన్వీనర్ ఎన్.ఏ.కుమార్ మరియు ఎన్టీఆర్ అభిమానులు పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే



**చింతూరు,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతూరు కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే ను స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్ర్యమంలో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన సదస్సులో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మల్లి శేఖర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవడం ఎంతో అవసరం అన్నారు. మనదేశం సాంకేతిక రంగంలో దూసుకుపోతుంది, యువత సాంకేతిక విద్య పట్ల మక్కువ కలిగి ఉండి, జీవితంలో ఉన్నత స్థానాలను అందిపుచ్చుకోవాలి అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఉద్యోగం కావాలి అన్నా కంప్యూటర్ విజ్ఞానం తప్పనిసరి అంటున్నారు కనుక బడి వయసునుండే కంప్యూటర్ నేర్చుకోవాలన్నారు.

తదుపరిఈ కార్యక్రమం నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు నూనె రమేష్ విద్యార్థులకు కంప్యూటర్ చరిత్ర మరియు కంప్యూటర్ విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేసి కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహన తరగతి నిర్వహించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ దేవరపల్లి రమాదేవి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలుమావిద్యాలయంలో నిర్వహించడం ఎంతో ఉపయోగకరం అన్నారు.కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మరియు కంప్యూటర్ సైన్స్ విభాగం వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో కెజిబీవీ విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పిల్లలకి ఆత్మస్థైర్యాన్ని కలుగచేయాలి – డా.రాయుడు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా చేయూత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ చేయూత భవన్ లో ఆత్మీయ స్పర్శ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సమావేశానికి చేయూత వ్యవస్థాపకులు విద్యావేత్త డా.ఎం.రవికుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా శ్రీ లాస్య హాస్పటల్ అధినేత త్రిమూర్తులు రాయుడు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా చేయూత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ..ఎయిడ్స్‌వ్యాధిగ్రస్తులకు భరోసా నివ్వడంద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపవచ్చన్నారు. ఇందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా త్రిమూర్తులు రాయుడు మాట్లాడుతు ఎయిడ్స్ పై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నిరోధించగలమన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు సక్రమమైన మార్గం అనుసరించడం ద్వారా సాధారణ వ్యక్తులు ఏవిధంగా జీవించగలుగుతున్నారో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు కూడా అదే విధంగా జీవించగలుగుతారని ఆయన తెలిపారు. అపోహలు, ఊహాగానాలకు తావులేకుండా క్రమం తప్పకుండా మందులు వేసుకొని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుందని డాక్టర్ త్రిమూర్తులు రాయుడుఅన్నారు. ఆ పిల్లలో ఆత్మస్థైర్యాన్ని కలుగచేయడం ద్వారా వారిలో నెలకొన్ని భయాన్ని పారద్రోలగలమని చెప్పారు. సుమారు లక్ష రూపాయిలు విలువ చేసే పౌష్టికాహార కిట్లు 100 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చేయూత సంస్థ కాకినాడ జిల్లా అధ్యక్షురాలు సురభీ శారద, రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ ఉదయభాను, సెక్రెటరీ మాచారెడ్డి, నేతి నాగేశ్వరరావు, రోటరీ మెయిన్ క్లబ్ సెక్రటరి బుజ్జి, రమేష్, చేయూత సంస్థ సభ్యులు జెమినీ బ్రదర్స్, విజయదుర్గా, పవన్, మాధవ్, సత్య, అంగడ లక్ష్మి, తేజస్వి, సత్య కీర్తి, శేషు కుమారి, దేగల లక్ష్మి,ఝాన్సి, వినీల్, వెంకీ, చేయూత సంస్థ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం చేయూత సంస్థకు సహకరిస్తున్న సభ్యులకు అధ్యక్ష, కార్యదర్శులు డా.రవికుమార్, అలీమ్ కలసి జ్ఞాపికలు అందజేసి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

## కడియం ప్రాంతాన్ని పర్యటకపరంగా
## ఆకట్టుకునే రీతిలో అభివృద్ధి -కలక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ప్రవేటు భాగస్వామ్యంతో కడియం నర్సరీలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేలా నర్సరీ ప్రతినిధులతో సంప్రదించడం, కార్యరూపం దాల్చడం పై సమన్వయ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరు ఛాంబర్‌లో పర్యటక, హార్టికల్చర్, రెవిన్యూ, పంచాయతి రాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, కడియం నర్సరీలను పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే విధంగా వివిధ రకాల అంశలతో కూడిన రీతిలో అభివృది చెయ్యాల్సి ఉంటుందన్నారు. బోటింగ్, స్టాల్స్, జిప్ లాగ్,అడ్వంచర్ స్పోర్ట్స్ తదితర అంశాల సమ్మేళనంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెయ్యాల్సి ఉంటుందన్నారు.ఏదో ఒక దానితో సరిపెట్టడం వల్ల పర్యాటకులను ఆకర్షించడం సాధ్యం అయ్యే అవకాశాలు ఉండవని తెలిపారు. టూరిజం అభివృద్ధి వలన ఈ ప్రాంతానికి గుర్తింపుతో పాటు, ఇక్కడి వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. స్టాల్స్ ప్రతిపాదన కోసం లే అవుట్ సిద్దం చేసి, కేటాయింపులు పై ప్రణాళిక అందచేయాలని ఆదేశించారు. సౌందర్య, వాస్తుశిల్పి, ఎక్కువ మంది సందర్శించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొవాల్సి ఉంటుందన్నారు. కడియం ప్రాంతాన్ని శానిటేషన్ పరంగా చక్కటి నిర్వహణా వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఏపీఎమ్ఐపి పిడి ఏ దుర్గేష్, జిల్లా పర్యటక అధికారి పి. వెంకటాచలం , పర్యటక శాఖ మేనేజర్ సీహెచ్.. పవన్ కుమార్, డిప్యూటి ఈఈ (పర్యటక) జి ఎస్ వివి సత్యనారాయణ, సహయ మేనేజర్ ఆర్ గంగా రాజు, జిల్లా హార్టీకల్చర్ అధికారి బి. సుజాత కుమారి, కడియం తహసిల్దార్ కే.. పోసుబాబు, ఎంపిడివో కే. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రు.80 వేల రూపాయలు విలువైన ఆర్టిఫిషియల్ లింబ్స్‌ను 8 మంది విభిన్న ప్రతిభావంతులకు అందజేసిన కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** దైనందిన జీవితంలో రోజువారి పనులను ఎవరు మీద ఆధారపడకుండా చేసుకునేందుకు వీలుగా 8 మంది విభిన్న ప్రతిభావంతులకు రు. 80 వేల రూపాయల విలువ గల ఆర్టిఫిషియల్ లింబ్స్ ను పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో పిజిఆర్ఎస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా 8 మందికి కృత్రిమ అవయవాలను (ఆర్టిఫిషియల్ లింబ్స్) కలెక్టర్ పి.ప్రశాంతి..జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ చిన్న రాముడు, డిఆర్ఓ డి సీతారామమూర్తి ఇతర జిల్లా అధికారులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ద్వారా డిస్ట్రిక్ట్ డిజబుల్ రిహబిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ లింబ్స్ ను విభిన్న ప్రతిభావంతులయిన చేట్ల రాజు వెలుగు బంధ, ఎర్రం శెట్టి సూర్యకుమారి సింగంపల్లి, గొందు త్రిమూర్తులు రాజమండ్రి, ఆకులు తిమ్మయ్య కొవ్వూరు పాడు, షేక్ అహ్మద్ భాషా బొమ్మూరు, మేకల కృష్ణ కాతేరు, నాగమణి రాజమహేంద్రవరం, సెల్వమణి బొమ్మూరు వారికి ఒక్కొక్కరికి రు. 10 వేల రూపాయలు విలువ గల ఆర్టిఫిషియల్ లింబ్స్ ను అందించడం జరిగిందన్నారు. కలెక్టర్ ఈసందర్భంగా వారి వద్దకే వచ్చి వారికి కృత్రిమ అవయవాలు అందించి వాటి పనితీరును పరిశీలించి, వారి యోగక్షేమాలని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ చిన్న రాముడు, డిఆర్ఓ డి సీతారామమూర్తి, డిడిఆర్సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ పెద్దిరెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొండమొదలు భూపోరాట వీరులకు ఘన నివాళి




**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** కొండమొదలు ఉద్యమ వీరులు కామ్రేడ్లు రాజులు, లక్ష్మయ్య వర్ధంతి సభ, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభ సావనీర్ ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రంపచోడవరంలో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) అనుబంధమైన ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొండమొదలు గిరిజన ఉద్యమ వీరులు కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల 41వ వర్ధంతి సభ సోమవారం విజయవంతంగా జరిగింది. సభకు ఏజెన్సీ గిరిజన సంఘ అధ్యక్షులు, కొండమొదలు సర్పంచ్ అయిన కామ్రేడ్ వేట్ల విజయ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఏఐకేఎం కేఎస్ జాతీయ కో కన్వీనర్ అయినా సింహాద్రి ఝాన్సీ తన ప్రధాన ఉపన్యాసంలో 42 సంవత్సరాల క్రితం 1982 నవంబర్ 29వ తారీఖున కొండమొదలులో జరిగిన భూపోరాటంలో జరిగిన పోలీసు కాల్పుల్లో అమరులు కామ్రేడ్లు కుంజం రాజులు, మడెం లక్ష్మయ్య లు అమరులైనారని, నాటి సంఘటనలు ఇక్కడ ఉన్నవారిలో సగం మంది యువకులకు తెలియదని, ఆనాటి పోరాటాల ఫలితంగా, సంఘం నాయకత్వాన భూముల సాగు హక్కులను సాధించుకోగలిగామని, తిండీ, బట్ట, గౌరవ ప్రదమైన జీవన ప్రమాణాలను పెంచుకోగలిగామని, విద్య, వైద్య సౌకర్యాలను అనుభవించగలుగుతున్నామని, ఇదంతా భూ పోరాటం వల్ల, ప్రజల ఐక్యత వల్లే సాధ్యపడిందని వివరించారు. పోలవరం ప్రాజెక్టు పునరావాస సమస్యల మధ్య భూమి హక్కులను, పునరావాస సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. సభలో ఏజెన్సీ గిరిజన సంఘ గౌరవ అధ్యక్షులు అధ్యక్షుడు కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి, సంఘ సహాయ కార్యదర్శి తాతి బుల్లెబ్బాయి, రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు తదితరులు మాట్లాడారు.ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల ప్రత్యేక సావనీర్ 2024ను కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి ఆవిష్కరించారు.

## శ్రీ సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1,30,30,404లు



**అన్నవరం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం నాడు హుండీల ఆదాయాన్ని నిత్య కళ్యాణ మండపంలో చైర్మన్ ఐ.వి.రోహిత్ సమక్షంలో లెక్కించారు.ఈ లెక్కింపులో బంగారం 52 గ్రాములు; సిల్వర్ 1,125 గ్రాములు; యూఎస్ఏ డాలర్స్ 46; మలేషియా రిగ్గిట్ 2; ఖతార్ రియాల్స్1; యూరో యూరొస్ 20; కువైట్ డైనర్స్1/2; సౌత్ ఆఫ్రికా రాండ్ 30; 1 కోటి 30 లక్షల 30 వేల 404 రూపాయలు వచ్చిందని దేవస్థానం అధికారులు తెలియజేశారు.ఈ లెక్కింపులో సేవకులు, దేవస్థానం సిబ్బంది,పురోహితులు,నాయిబ్రాహ్మణులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులలో 800 లీ.బెల్లపు ఊట ధ్వంసం




**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో పెద్దాపురం సర్కిల్ పరిధిలోని పెద్దాపురం మండలంలోని జె.తిమ్మా పురం గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 800 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై చిట్టిబాబు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక గంగిరెద్దుల కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యండి

**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** అన్ని రంగాల్లో వెనకబడివున్న గంగిరెద్దుల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాలని కూటమి ప్రభుత్వాన్ని టీడీపీ నాయకులు రాష్ట్ర ఎంబీసీ (సంచార జాతుల) కమిటీ సభ్యులు యడ్లపల్లి తుక్కియ్య కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుమారు 2లక్షలు మందికిపైగా గంగిరెద్దుల సామాజికవర్గానికి చెందినవారు వున్నారని, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారని, రాజకీయంగా ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి వున్నారని, వీరికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రత్యేక దృష్టి సారించి వారిని ఆదుకోవాలని కోరారు. 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి గంగిరెద్దుల సామాజికవర్గం అండగా నిలిచి విజయానికి కృషి చేసారని తుక్కియ్య తెలిపారు.



# ఎమ్మెల్సీ, నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై జెసి చిన్నరాముడు వీడియో కాన్ఫరెన్స్

**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** సోమవారం సాయంత్రం కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికలు, నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడంపై జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామమూర్తి లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల వద్ద లోపలికి బయటకి ప్రత్యేక మార్గాలు, బందోబస్తు, పోలింగ్ కేంద్రాల, రీసెప్షన్ కేంద్రాల మ్యాప్ సిద్ధం చెయ్యాలనీ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద వీడియో గ్రాఫింగ్ చెయ్యాల్సి ఉంటుందన్నారు. రిటర్నింగ్ అధికారి పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణ కు అధికారం కలిగి ఉంటారని పేర్కొన్నారు. చెక్ లిస్టు ప్రకారం సంబంధిత అధికారులు ధృవీకరణ పత్రాలు ముందుగా అందచేయాలని ఆదేశించారు. నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం కోసం డిసెంబర్ 5 వ తేదీ నాటికి తీసుకున్న చర్య పై నివేదిక ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు అందచేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. ప్రాదేశిక, గ్రామ స్థాయి నియోజక వర్గ ఎలెక్టోరల్ నిర్ధారణ చేసుకోవాలని ఆదేశించారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసిజర్ సాఫ్ట్ కాపీ అందజేయాలన్నారు. ఎన్నికల నిర్వాహణలో ఎటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశంలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యా అనుబంధ శాఖల సిబ్బందికి నీటి వినియోగదారులఎన్నికలవిధులు నుంచి మినహాయింపు ఇవ్వడం జరిగిందని, అందుకు అనుగుణంగా ఇతర అందుబాటులో వున్న సిబ్బందికి విధులను కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితా నిర్ధారణలో తహసీల్దార్,ఇరిగేషన్ అధికారులు వ్యక్తిగత బాధ్యత పర్యవేక్షణా చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, నీటి తిరువావసూళ్ల పరంగా పనితీరుమెరుగు పరుచుకోవాలన్నారు. గోకవరం , కోరుకొండ, రంగంపేట మండలాల్లో నీటి తీరువా పన్నుల వసూళ్ల విషయములో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై అసహనం వ్యక్తంచేశారు. ఎన్ని గ్రామాలకు డిమాండ్ ఇవ్వడం జరిగింది, వాటిలో ఎన్ని గ్రామాల్లో వసూళ్లు ప్రారంభించడం జరిగింది అని పేర్కొన్నారు. ప్రతి ఎకరానికి 100 రూపాయలు నీటి తీరువా వసూళు చెయ్యాల్సి ఉండగా ఎందుకు చెయ్యడం లేదని ప్రశ్నించారు. పన్నుల వసూళ్ల ఆధారంగా కాడానిధుల విడుదల ఉంటుందని, తదనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యం అవుతుందని తెలిపారు.



ఓటరు జాబితా రూపకల్పన విషయంలో, యువ ఓటర్ల నమోదులో ఎలెక్టోరల్ రిటర్నింగ్ అధికారి, సహాయ ఎలెక్టోరల్ రిటర్నింగ్ అధికారి లదే వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల సంఖ్య అనుగుణంగా ఓటర్ల నమోదు ఉండాలన్నారు. జిల్లాలో జనాభా దామాషా ప్రకారం యువ ఓటర్ల నమోదు ఉండాలని, ఆ క్రమంలో ఓటరు నమోదు కావడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో విచలనం ఉంటే ఉపేక్షించడం జరగదని తెలియ చేశారు. జిల్లా రెవిన్యూ అధికారి టి.సీతారామమూర్తి మాట్లాడుతూ, డిసెంబర్ 4 న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ మెటీరియల్ పంపిణి చెయ్యడం జరుగుతుందని తెలిపారు.

అందులో భాగంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, డిసెంబర్ 3వ తేదీన ముందస్తు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించాలి

**-ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు పెండింగ్ ఉండరాదని, రీ ఓపెన్ కారాదు**
**-ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు నుంచి126 అర్జీలను స్వీకరించాం -జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ పి. ప్రశాంతి 126 అర్జీలను జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, వీఆర్వో సీతారామమూర్తి తో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వారం వారం సమీక్షిస్తున్నారన్నారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్, పంచాయితీ రాజ్ శాఖలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు రావడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్జీదారుల సమస్యలకు నాణ్యతతో కూడిన విధంగా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు పెండింగ్ ఉండరాదని, రీ ఓపెన్ కారాదని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ కు జిల్లా అధికారులు వచ్చే ముందు శాఖా పరంగా పెండింగులో ఉన్న అర్జీల వివరాలను నివేదిక రూపంలో అందింస్తే వాటిని ఎందుకు పరిష్కరించలేదన్న అంశంపై ర్యాండమ్ వారి సమీక్షించడం జరుగుతుందన్నారు.

డిసెంబర్ 5వ తేదీ ఉమ్మడి తూర్పు - పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి ఉపాధ్యాయుల శాసనమండలి సభ్యుల పోలింగ్ ప్రక్రియకు అన్ని మండల కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలవిధులు నిర్వహించే అధికారులు బాధ్యతా యుతంగా నిర్వహించాలని ఆదేశించారు. అదే రోజు (డిసెంబర్ 5వ తేదీన) జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించే నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలో ఎం ఎస్ ఎం ఈ, స్కిల్ డెవలప్మెంట్, పశుగణన, పిఎంఈ వై 2.0 ,లబ్ధిదారులు గుర్తింపు వంటి సర్వేలు నిర్వహించడం జరుగుతుందని మండలస్థాయి అధికారులు అందరూ ఆయా మండలాల్లోనే అందుబాటులో ఉండి కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు నుంచి126 అర్జీలను స్వీకరించామన్నారు. ఇందులో ఆన్ లైన్ ద్వారా125 ఆఫ్ లైన్ ద్వారా ఒక్క అర్జీ వచ్చాయన్నారు.

## గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు

**- వైద్య శిబిరంను పరిశీలించిన డివైఇఓ ప్రభాకర శర్మ**




**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక పద్మనాభ కాలనీలో గల గరల్స్ హైస్కూల్ నందు ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యురాలు డా.ఎల్.అనూషరాయ్, ప్రదానోపాధ్యాయులు బి.జె.రవీంద్రల ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం డివైఇఓ ఈరంకి ప్రభాకర శర్మ వైద్య శిబిరంను పరిశీలించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు హెచ్.బి., ఎత్తు, బరువు, కంటి చూపు, బిపి, సాధారణ ఆరోగ్య పరీక్షలు, నిర్వహించి వైద్యుల సూచనల మేరకు విద్యార్థిణిలకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓవి.ఆర్.కె.చౌదరి, డా.జె.రాజేశ్వరి,వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకి అండగా లయన్స్ క్లబ్ వుంటుంది - గుప్త



**రాజమండ్రి,మేజర్‌న్యూస్ :** లయన్స్ క్లబ్ రాజమహేం ద్రవరం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా జనకల్యాణ్ సంస్థ నందు గల ఎయిడ్స్ భాదిత పిల్లలకు క్లబ్ అధ్యక్షుడు మద్దుల వి.ఎస్. శ్రీరామ గుప్త సారథ్యంలో పళ్లు, బిస్కెట్స్ పంచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ పూర్వపు గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధివంచితులయిన ఎయిడ్స్ రోగులకు మానవతా సాయంతో పాటు మానసిక ధైర్యం కలిగించడానికి మేము మీకు అండగా వున్నామని తెలిపారు. వారికి అవసరమైన అన్నిరకాల సాయం చేయడానికి ఎల్లప్పుడు మా క్లబ్ ముందుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వెన్నా కుమారస్వామి, అడ్మిన్ గ్రంథి లక్ష్మి వసంత కుమారి, మద్దుల గౌరి తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంఘాల ఎన్నికలకు శిక్షణ



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దా పురం మండల పరిషత్ కార్యాలయంలో డిశంబర్ 8న నిర్వహించే నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి, ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్య క్రమం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 15 నీటి సంఘాలు ఉన్నాయని (ఏలేరు5,పుష్కర 2, చెరువులు 8) ఉన్నాయని ఆయా ఆయకట్టుకు, చెరువులకు సంబంధించి,ఈఎన్నికలు నిర్వ హించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్ తెలుపుతూ ఓటర్ జాబితా తదితర అంశాలుపై ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈశిక్షణాకార్యక్రమంలోడిటి టి.కాంతా రావు,ఆర్ఐ కె.వి.రమణ,ఎన్నికల శిక్షణాసిబ్బంది పాల్గొన్నారు.

## పంటపై ఆశలు - నింగిపై మబ్బులు -రైతన్న ప్రస్తుత పరిస్థితి

**రౌతులపూడి,మేజర్‌న్యూస్ :** మండల గ్రామాల్లోని పంట చేతికి వచ్చే సమయంలో ఫెంగాల్ తుఫాన్ ప్రభావంతో పంటపై ఆశలు నింగిపై మబ్బులతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఆందోళన చెందుతున్నారు ఎంతోకాలం శ్రమించి అప్పులు చేసి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాలు వల్ల ఏదో విధంగా నష్టం వాటిల్లుతూనే ఉందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడును రాక అప్పుల ఉబిలో ప్రతి ఏడాది కురుకపోవడం జరుగుతుందని నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మెట్ల ప్రాంతాలలో వ్యవసాయ సాగే ఆధారంగా జీవిస్తున్న రైతన్న కుటుంబాలు వారి జీవనస్థితి ప్రశ్నార్థకమయింది. ఇటువంటి కారణాలతోనే కొంతమంది రైతులు ఇప్పటికే వరి పంటను తగ్గించి ఇతర పంటలైన సరుగుడి,చెరుకు,పామ్ ఆయిల్,పోగాకు వంటిపంటల సాగుకుమొగ్గు చూపుతు న్నారు. రౌతులపూడి మండలంలో 4300 ఎకరాలు వరి నాటడం జరిగింది. అయితే పల సాయానికి వచ్చే ముందుగా తుఫాను కారణంగా 350 ఎకరాలు వరి పంటనేల ఒరిగిందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. మరి కొంతమంది రైతులు తుపాన్ ప్రభావం తెలియక వరి చేను కోత కోయడం జరిగింది. అవి పొలాల్లో తడిసి వరి పనలు ముద్దయి నేల రాలుతున్నాయి. అధిక పెట్టులుతో ఎరువులకి, క్రిమిసాహారక మందులుకు అధిక మొత్తం చెల్లించవలసి వస్తుందని అంటున్నారు. ఈ రోజుల్లో వ్యవసాయం సాగు చేయడం అంటే చాలా కష్టతరం అని రైతులు వాపోతున్నారు. ఏదో విధంగా రైతులు ప్రకృతి వైపరీత్యంవల్ల మరియు పంటలకు రోగాలవల్ల అప్పులుఊపులో కురుపోతున్నాం అంటున్నారు. ప్రభుత్వ సహాయం అంతంత మాత్రమేనని తీరా పండించిన ధాన్యాన్ని కిట్టుబాటు ధర రాని పరిస్థితులు రైతన్నది. రైతన్న దేశానికి వెన్నెముక కాబట్టి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలసిన అవసరం ఉంది.



## యూటీఫ్ జిల్లా కార్యదర్శిగా మిరియాల రమేష్‌బాబు

**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** యూటీఎఫ్ అల్లూరి జిల్లా కార్యదర్శిగా మిరియాల రమేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని అరకు వ్యాలీలో జరిగిన యుటిఎఫ్ జిల్లా మహాసభలో రాజవొమ్మంగి మండలం నుండి రమేష్ బాబును ఎన్ని కున్నట్లు ఆయన తెలిపారు. మండలం లోని చిన్నయ్యపాలెం ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న రమేష్ బాబు యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా గతంలో పనిచేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు పి.వి సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తుల్లోకామ్రేడ్ రమేష్ ఎప్పుడుముందుంటారని కొనియాడారు. మండల ప్రధాన కార్యదర్శి కానెం శ్రీను మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఫ్)లో సభ్యుడిగా చేరినప్పటి నుండి సంఘం తనకు అప్పగించిన ప్రతి పని పరిపూర్ణంగా నిర్వర్తిస్తూ.. ఎంతో బాధ్యతాయుతంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అదేవిధంగా విద్యారంగ అభివృద్ధికి నిరంతరం రాజీలేకుండా. అలుపెరగని పోరాటం చేస్తున్న యువ నాయకుడు రమేష్ బాబును ప్రతి యుటిఎఫ్ కార్యకర్తఆదర్శంగా తీసుకొని సంఘ బలోపేతానికి కృషిచేయాలన్నారు. జిల్లా కార్యదర్శి గా మన మండలం నుండి ఎంపికైనందుకుగాను యుటిఎఫ్ రాజవొమ్మంగి మండలశాఖ పక్షాన హర్షిస్తూ ఉద్యమానందనలు తెలుపుతున్నామ న్నారు. ఈకార్యక్రమంలో కె రాంబాబు, పీవీ సుబ్బారావు, జి. శ్రీను మహిళా నాయకులు కె.లోవరాజు, మహిళా కార్యదర్శి టీ.వీఎల్ ప్రసన్న, ప్రధాన కార్యదర్శి కానెం శ్రీను, కోశాధికారి ఆవూరి సతీష్,జిల్లా కౌన్సిలర్లు,రమణ, పైడిమల్లి బొజ్జియ్య, ఉదయ్, వెంకటలక్ష్మి, రాధా, తదితరులు ఉన్నారు.



## ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో కాలుష్య నియంత్రణ దినోత్సవం జరిగింది. 1984లో భోపాల్ విషాదంలో మరణించిన వేలాది మంది వ్యక్తుల జ్ఞాపకంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ నాయుడు ఆదేశాల మేరకు కళాశాల సమీపంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిసత్యనారాయణ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత ప్రతి ఒక్కరూపైనఉందని,లక్షలటన్నుల ప్లాస్టిక్ వాడుతున్నారని, కుప్పలుతెప్పలుగా పడి ఉన్న ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు ఉన్నాయని అన్నారు. భూమిలో కరగడానికి వందల ఏళ్ళు పట్టే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అన్నారు. ఇన్చార్జి మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కవర్లు వాడకం తగ్గించి గుడ్డ లేదా జనపనార సంచులు వాడాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి , డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, ఐ గౌరీ ప్రియ మరియు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.




## అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలలో యూనివర్శిటీ కళాశాల జట్టు ప్రథమ స్థానం

**- యుసిఇకె ప్రిన్సిపాల్ ఆఫీస్ నందు అభినందన కార్యక్రమం**

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఈనెల1,2 తేదీలలో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ (పురుషులు) పోటీలలో జెఎన్‌టియుకె యూనివర్శిటీ కళాశాల జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు రెండు యూనివర్శిటీల సెలక్షన్‌లను కూడా కైవసం చేసుకోవడం పట్ల యుసిఇకె ప్రిన్సిపాల్ ఆఫీస్ నందు అభినందన కార్యక్రమం నిర్వహించారు. అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలలో యూనివర్శిటీ కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలవడం పట్ల యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు ఆనందం వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు తమిళనాడులోని వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో జరగనున్న యూనివర్శిటీ పోటీలలో జెఎన్‌టియుకె యూనివర్శిటీ కళాశాల జట్టు పాల్గొననుందని, ఈ పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ జట్టులో ఇద్దరు యుసిఇకె కళాశాల విద్యార్థులు ఉండటం అభినందనీయమన్నారు. అనంతరం టేబుల్‌టెన్నీస్ క్రీడాకారులను,వారికి తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు, యూనివర్శిటీ స్పోర్ట్స్‌కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్‌కుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు.



## జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం

**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** మండలంలోని బుట్టాయగూడెం గ్రామ పంచాయతీలో మహిళల భద్రత,జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం పోలీస్ మహిళా శిశుసంక్షేమశాఖ, గ్రామీణ అభివృద్ధి పేదరిక నిర్మూలన శాఖ, భాగస్వామ్యంతో నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా స్థానిక డ్వాక్రా సిఎ మందపాటి ఝాన్సి ఆధ్వర్యంలో లో ర్యాలీ ప్రతిజ్ఞ అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమం లో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, అంబేద్కర్,డ్వాక్రా సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా గణేష్ భవాని

**పాలకొల్లు ,మేజర్ న్యూస్:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సమావేశం విజయవాడ ప్రెస్ క్లబ్ నందు నిర్వహించారని, వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు గా. 2వ సారి పాలకొల్లు పట్టణానికి చెందిన ముద్దాడ గణేష్ భవానిని నియమించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ భవాని మాట్లాడుతూ తనను గుర్తించి రెండోసారి పదవి ఇచ్చిన జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య , రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరావు,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెలగణ నూకనమ్మ,రాష్ట్ర కన్వీనర్, ఇన్చార్జి.బోను దుర్గ నరేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## క్షీరా రామాన్ని దర్శించిన ఐఏఎస్ అధికారి

**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పంచారామ క్షేత్రాలలో ఒకటైన శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు పి.ఏ.టు సీఎం ప్రద్యుమ్న కుటుంబ సభ్యులకు సోమవారం స్వామివారిని దర్శించుకున్నారు,ఆలయ కార్య నిర్వహణ అధికారి ముచ్చర్ల శ్రీనివాస్ దగ్గరుండి ఆలయం మర్యాదలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలను పండితులచే నిర్వహించారు,ఈ కార్యక్రమానికి నర్సాపురం ఆర్డీవో దాసిరాజు, పాలకొల్లు తహసిల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్,పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోలా రజిని కుమార్ తదితరులు పాల్గొన్నారు,

## కొప్పర్రులో హెూమియో మందులు పంపిణీ

**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్:** మండలంలోని కొప్పర్రు గ్రామంలో సోమవారం వినాయక ఆలయం, అందే పిచ్చయ్య విగ్రహం దగ్గర పోడూరు శ్రీ రామకృష్ణ పరమహంస హెూమియో పతి హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఉచితముగా హెూమియో పంపిణీ చేశారు. పరిసర ప్రాంత గ్రామాల నుండి అధిక సంఖ్యలో వచ్చి హెూమియో మందులు ఉచితంగా తీసుకున్నారు.

## సాయుధ దళాల పతాక నిధికి ఉదారంగా విరాళాలు

**- కార్ ఫ్లాగ్స్, స్టిక్కర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** మన దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలు విధులను నిర్వర్తిస్తున్న సైనికుల,మాజీ సైనికుల సంక్షేమానికోసం సాయుధ దళాల పతాక నిధికి అన్ని వర్గాల ప్రజలు ఉదారంగా, విరివిగా విరాళాలు అందించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు.

సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయిధ దళాల పతాక దినోత్సవంను పురస్కరించుకొని రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్,కరపత్రాలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి,డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి కె.వి.ఎస్ ప్రసాదరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రాధాన్యత, సైనిక సంక్షేమ నిధికి విరాళాల సేకరణ అంశాలపై జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసాదరావు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులకు వివరించి కరపత్రాలను అందించి, విరాళాల సేకరణకు జిల్లా అధికారుల సహకారాన్ని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు సాయుధ దళాలలో పనిచేస్తున్న సైనికులకు సంఘీభావాన్ని ప్రకటించి మాజీ సైనికుల పునరావస కార్యక్రమంలో అమరులైన వీర జవాన్లకు, వితంతువులకు వారి కుటుంబ సభ్యులకు ఆదుకునే క్రమంలో ఉదారంగా ప్రజలు విరాళాలు అందించవలసిందిగా కోరారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ సైనికులు, యుద్ధ సమయంలో మరణించిన వారి వారసుల సంక్షేమం కొరకు జిల్లాలోని ఎన్.సి. సి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు హుండీ ద్వారా ప్రజల నుండి విరాళాలను సేకరించి స్టిక్కర్లను,కార్ ఫ్లాగ్స్ ఆయా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు పంపి వాటి అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయమును విరాళముగా స్వీకరించబడుతుందని తెలిపారు.